# ఓటు హక్కు పరిరక్షణపై అప్రమత్తంగా ఉండాలి



**దశ, ఓయూ:** SIR రెండో దశలో భాగంగా ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో గురువారం నాచారం సర్కిల్‌లో వార్డు సభ నిర్వహించారు. AERO నిత్యానంద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు భావన గౌడ్ పాల్గొన్నారు. BLOలు, సూపర్‌వైజర్లు యశ్వంత్, ప్రదీప్, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు, BLA2లు హాజరయ్యారు. ఈ సందర్భంగా AERO నిత్యానంద్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ, ఓటు హక్కు పరిరక్షణకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఇప్పటికే నోటీసులు అందుకున్న వారు అధికారులు సూచించిన 11 రకాల పత్రాల్లో ఏదైనా ఒక ధ్రువీకరణ పత్రాన్ని BLOకు సమర్పిస్తే సరిపోతుందని తెలిపారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును కాపాడుకునేలా అప్రమత్తంగా ఉండాలని, ఓటర్ల జాబితాలో తమ పేరు, వివరాలను సరిచూసుకోవాలని సూచించారు. ఓటర్ల నమోదు, తొలగింపు, వివరాల మార్పులకు సంబంధించిన ఫారం6, ఫారం7, ఫారం8 విధివిధానాలు, వాటి వినియోగంపై ప్రజలకు వివరించారు.

# రోడ్లపై పశువులను వదిలితే చర్యలు



**దశ, నల్లగొండ :** నగరంలోని ప్రధాన రహదారులు, వీధుల్లో పశువులను విచ్చలవిడిగా వదిలే యజమానులపై చర్యలు తీసుకుంటామని నల్లగొండ నగరపాలక సంస్థ కమిషనర్ బి. వంశీకృష్ణ హెచ్చరించారు. రోడ్లపై పశువులు సంచరించడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పాటు, వాహనాల ముందుకు అకస్మాత్తుగా రావడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. దీంతో వాహనదారులు, పాదచారుల భద్రతకు ముప్పు ఏర్పడుతోందని తెలిపారు. పశువుల యజమానులు వాటిని రోడ్లపైకి వదలకుండా సొంత స్థలాల్లో లేదా సురక్షిత ప్రాంతాల్లో ఉంచుకోవాలని సూచించారు. రోడ్లపై పశువులను వదిలే యజమానులకు నోటీసులు జారీ చేసి 7 రోజుల గడువు ఇవ్వనున్నట్లు తెలిపారు. గడువు అనంతరం కూడా పశువులను రోడ్లపైకి వదిలితే మున్సిపల్ చట్టం 2019 ప్రకారం జరిమానాలు విధించడంతో పాటు తదుపరి చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. రోడ్లపై సంచరిస్తున్న పశువులను సిబ్బంది పట్టుకుని గోశాలలకు తరలించడంతో పాటు, యజమానులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్‌లో అనిరా ఆలివ్స్‌కు రెండు పతకాలు



**దశ, హైదరాబాద్ :** జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్‌షిప్‌లో అనిరా ఆలివ్స్ సంగేపు అద్భుత ప్రతిభ కనబరిచి రెండు పతకాలు సాధించింది. అండర్ 8 బాలికల విభాగంలో కాటా, కుమిటే పోటీల్లో సత్తా చాటింది. కాటా విభాగంలో రజత పతకం, కుమిటే విభాగంలో కాంస్య పతకం కైవసం చేసుకుంది. గతంలోనూ పలు కరాటే పోటీల్లో పాల్గొని అనిరా అనేక పతకాలు సాధించింది. కరాటేతో పాటు తైక్వాండోలోనూ శిక్షణ పొందుతూ పోటీల్లో ప్రతిభ కనబరిచింది. ప్రస్తుతం కోచ్ కిరణ్ పర్యవేక్షణలో కరాటేలో ప్రత్యేక శిక్షణ పొందుతున్న అనిరాను కోచ్, క్రీడా ప్రముఖులు, కుటుంబ సభ్యులు అభినందించారు. జాతీయ స్థాయిలో రెండు పతకాలు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# చౌటుప్పల్ అభివృద్ధికి రూ.53.52 కోట్ల ప్రతిపాదనలు



- *20 వార్డుల్లో అభివృద్ధి, పారిశుధ్యం, మౌలిక వసతులకు ప్రాధాన్యం*
- *నూతన మున్సిపల్ కార్యాలయానికి రూ.9.65 కోట్లు*
- *UCF బృహత్ ప్రాజెక్టులకు రూ.38 కోట్లు*

**దశ, చౌటుప్పల్ :** చౌటుప్పల్ పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ ముగుదాల పావని రమేష్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో కౌన్సిలర్లు పాల్గొనగా, లైన్ డిపార్ట్మెంట్ అధికారులు తమ నివేదికలను సమర్పించారు. ఎజెండా అంశాలపై చర్చ జరుగుతున్న సమయంలో ప్రతిపక్ష కౌన్సిలర్లు వాక్‌అవుట్ చేశారు. సమావేశంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా వార్డుల వారీగా, బూత్‌ల వారీగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ చేపట్టాలని కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. అనంతరం పట్టణంలోని 20 వార్డుల అభివృద్ధి, పారిశుధ్యం, మౌలిక వసతులు, నూతన భవనాల నిర్మాణానికి మొత్తం రూ.53.52 కోట్ల అంచనా వ్యయ ప్రతిపాదనలకు పరిపాలనా ఆమోదం కోసం పంపించారు. ఇందులో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద మల్టీఫంక్షన్ హాల్, గాంధీ పార్క్ టౌన్ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.38 కోట్లు, నూతన మున్సిపల్ కార్యాలయ భవనానికి రూ.9.65 కోట్లు కేటాయించారు. ఘన వ్యర్థాల నిర్వహణ, డ్రెయిన్లు, స్మశానవాటిక అభివృద్ధికి రూ.2.64 కోట్లు, 20 వార్డుల్లో అత్యవసర పనులకు రూ.1.90 కోట్లు ప్రతిపాదించారు. వీధి దీపాల నిర్వహణకు రూ.50 లక్షలు, పారిశుధ్య నిర్వహణకు రూ.44 లక్షలు, వేసవి తాగునీటి ప్రణాళికకు రూ.36 లక్షలు కేటాయించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ, చౌటుప్పల్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత పాటిస్తూ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు.




# చదువుతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని.. కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు

**దశ, ఓయూ:** విద్యతోపాటు క్రీడల పైన యువత దృష్టి సారించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా క్రీడలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ ఇంగ్లీష్ అండ్ ఫారెన్ లాంగ్వేజ్ యూనివర్సిటీలో కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా 1500 విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు, యువ క్రీడాకారులతో ఆన్లైన్ ద్వారా ముచ్చటించారు. యువత ప్రత్యేక పథకాలు సాధించడమే ప్రధాన నరేంద్ర మోడీ లక్ష్యం అని పేర్కొన్నారు 20 30 కామన్వెల్స్ గేమ్స్ కు ఆదిపత్యం ఇవ్వనుంది అలాగే 2036 ఒలంపిక్స్ ను భారత్ నిర్వహించేలా ఇతర దేశాలతో చర్చలు జరుపుతూ ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. విద్యాసంస్థల నిర్వాహకులు చదువుతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.



# రూ.30 లక్షలతో ఇందు ఆరణ్య పల్లవి అపార్ట్‌మెంట్‌లో ఓపెన్ జిమ్ ఏర్పాటు

**దశ, , పెద్ద అంబర్ పేట :** తట్టి అన్నారంలోని ఇందు ఆరణ్య పల్లవి అపార్ట్‌మెంట్‌లో రూ.30 లక్షల వ్యయంతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. స్థానికుల ఆరోగ్యం, వ్యాయామ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కృషి చేసిన మాజీ కౌన్సిలర్ తొండాపు రోహిణి బ్రహ్మానందరెడ్డికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. అపార్ట్‌మెంట్ పరిసరాల్లో ప్రజలకు ఉపయోగపడే విధంగా ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. స్థానికుల ఆరోగ్యానికి, యువతకు ఈ ఓపెన్ జిమ్ ఎంతగానో ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి సదుపాయం కల్పించేందుకు కృషి చేసిన మాజీ కౌన్సిలర్ రోహిణి బ్రహ్మానందరెడ్డికి స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

# ప్రజాపాలన కాదు.. నిర్బంధ పాలన: సత్తు వెంకటరమణారెడ్డి




**దశ, రంగారెడ్డి:** ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధ పాలన కొనసాగిస్తోందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి విమర్శించారు. వరంగల్‌లో పాలిటెక్నిక్ విద్యార్థులను కలిసేందుకు వెళ్లిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావులను హన్మకొండలో అరెస్టు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న మాజీ మంత్రి సబితారెడ్డిని గృహనిర్బంధం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. హరీశ్‌రావు, సబితారెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితర బీఆర్ఎస్ నేతలను తరచూ గృహనిర్బంధం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని ఆరోపించారు.

కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడగడం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. పీఆర్సీ ప్రకటించకపోవడంతో పాటు డీఏలను పెండింగ్‌లో పెట్టి ఉద్యోగులను ప్రభుత్వం మోసం చేస్తోందని ఆరోపించారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రత పథకాన్ని కూడా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. 317 జీవో ద్వారా ఇతర జిల్లాలకు వెళ్లిన ఉద్యోగులను తిరిగి తీసుకువస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం మరిచిపోయిందన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలపై పోరాడుతున్న వారికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు. రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని, రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ప్రతిపక్షాల గొంతు నొక్కడం మానేసి ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టాలని సత్తు వెంకటరమణారెడ్డి కోరారు.

# పెద్ద అంబర్‌పేట్‌లో రోడ్డు ప్రమాదం..

- *చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి*

**దశ, పెద్ద అంబర్‌పేట్ :** హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్ద అంబర్‌పేట్ ఆర్.ఆర్.ఆర్. వైన్స్ సమీపంలో క్రేన్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం 9.15 గంటల సమయంలో హయత్‌నగర్ నుంచి పెద్ద అంబర్‌పేట్ వైపు వెళ్తున్న క్రేన్ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఢీకొట్టింది. క్రేన్ అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో వ్యక్తి కిందపడిపోగా, క్రేన్ అతని చేతిపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది వెంటనే బాధితుడిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు మధ్యాహ్నం 12.40 గంటలకు మృతి చెందాడు. ఈ ఘటనపై హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు, గుర్తింపు ఇంకా తెలియరాలేదు. మృతుడిని గుర్తించిన వారు లేదా ఘటనకు సంబంధించిన సమాచారం ఉన్నవారు 8712662283, 8712662640, 8712662301 నంబర్లను సంప్రదించాలని పోలీసులు కోరారు.



# పెరిగిన నిత్యావసర ధరలను తగ్గించాలి: వ్యవసాయ కార్మిక సంఘం

**దశ, రామన్నపేట:** కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పేదలు, వ్యవసాయ కూలీలు, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర భారం పడుతోందని వ్యవసాయ కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య అన్నారు. చక్కెర, వంటనూనె, పప్పులు, బియ్యం, పిండి, కూరగాయలు, ఉల్లిపాయల ధరలు పెరుగుతుండటంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వ నిల్వలను వినియోగించాలని, మార్కెట్‌లో కృత్రిమ కొరతను అరికట్టాలని, పేదలకు సబ్సిడీపై నిత్యావసర సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించి సామాన్యులకు ఉపశమనం కల్పించాలని కోరారు. ధరలు వెంటనే తగ్గించకపోతే వ్యవసాయ కూలీలు, ప్రజలను పెద్ద ఎత్తున సమీకరించి ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సుభాష్ సెంటర్‌లో పెరిగిన ధరలకు వ్యతిరేకంగా మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో కందుల హనుమంతు, మేడి ముకుంద, అవనగంటి నగేష్, ఉంద్రాతి నరసింహ, నాగటి లక్ష్మణ్, శానకొండ వెంకటేశ్వర్లు, ఎడ్ల ధనమ్మ, పిట్టల పద్మ, చెన్ని స్వామి, నరసింహచారి, గొర్రె నాగిటి ఉపేందర్, తాళ్లపల్లి జితేందర్, జోగుల శ్రీనివాస్, కొమ్ము నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాఖీ బంధం.. బాలికల భద్రతకు మన ప్రతిజ్ఞ



**దశ, రంగారెడ్డి :** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'రాఖీ బంధం - బాలికల భద్రతకు మన ప్రతిజ్ఞ' అనే సందేశంతో రాఖీ వేడుకలు, సంతకాల ప్రచారం నిర్వహించారు. బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో బాలికల భద్రత, గౌరవం, విద్య, సమానత్వం, సురక్షిత భవిష్యత్తుపై అవగాహన కల్పించారు. ప్రత్యేకంగా రూపొందించిన భారీ రాఖీ ద్వారా బాలికల రక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, మహిళలు, యువత, ప్రజలు పాల్గొని బాలికల భద్రత, సాధికారతకు మద్దతుగా సంతకాలు చేశారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి మాట్లాడుతూ బాలికలకు సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. విద్య, భద్రత, సమాన అవకాశాలు, ఆత్మవిశ్వాసం కల్పించడం ద్వారా సమాజం సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ బాలికలు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని, విద్య ద్వారానే మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ బాలికల రక్షణ, విద్య, సాధికారత కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అదనపు కలెక్టర్ చంద్రరెడ్డి 'బాలికల భద్రత మన బాధ్యత' అని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. జిల్లా సంక్షేమ అధికారి శాంతిశ్రీ మాట్లాడుతూ బాలికల భద్రత, గౌరవం, ఉజ్వల భవిష్యత్తు కోసం సమాజం మొత్తం బాధ్యతగా నిలవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లైస్ అధికారి హరీష్, ఏఓ సునీల్ నాథాని, ట్రెజరీ అధికారి జి. సూర్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, సంక్షేమ శాఖ సిబ్బంది, డీహెచ్ఈడబ్ల్యూ, ఐసీపీఎస్ సిబ్బంది, కిశోర బాలికలు, డాన్‌బాస్కో హోమ్స్ పిల్లలు పాల్గొన్నారు.

# సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ వచ్చే వరకు పోరాడుదాం... సాధించి తీరుదాం

❖ బుల్లెట్ ట్రైన్ సాధన కోసం అఖిలపక్ష దీక్షలకు మద్దతు పలికిన బీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్లు



**దశ, సూర్యాపేట ప్రతినిధి:** సూర్యాపేటకు రైలు మార్గం అనేది ప్రజల కల అని నేడు బుల్లెట్ ట్రైన్ రూపంలో ఆ కల సాకారమవుతున్న తరుణంలో మొదట సూర్యాపేటకు కేటాయించిన బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ను మరో చోటకు మార్చడం తగదని బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంగిరేకుల నాగార్జున, మాజీ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్ లు అన్నారు.

సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ కోసం బుల్లెట్ ట్రైన్ సాదన అఖిలపక్షాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షల్లో 14వ రోజు కూర్చున్న ఐద్వా మహిళలకు బీఆర్ఎస్ పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు సంఘీభావం తెలిపిన సందర్భంగా వారు మాట్లాడారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ సాధించేందుకు ఉద్యమం ఉవ్వెత్తున సాగుతుందని బుల్లెట్ ట్రైన్ వచ్చే వరకు వెనక్కు తగ్గేది లేదన్నారు. సూర్యాపేటకు రైలు ప్రజల కల అని దాన్ని సాదించే వరకు నిర్వహించే ఏ పోరాటానికైనా తమ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. రాష్ట్రంలోని 33జిల్లాలో సూర్యాపేట జిల్లాకు మాత్రమే రైలు మార్గం లేదని అందుకే ఈ ప్రాంతం అన్ని రంగాల్లో వెనుకబడిందన్నారు. ప్రస్తుతం మనకు కేటాయించిన బుల్లెట్ ట్రైన్ అలైన్మెంట్ను మార్చారని తిరిగి దాన్ని మనం సాధించకుంటే ఇంకెప్పటికి మనకు రైలు వచ్చే అవకాశం లేదన్నారు.

రాజకీయాలకతీతంగా ప్రజాప్రతినిధులు, నాయకులు స్పందించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తులు చేసి సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ తీసుకొచ్చి ప్రజల స్వప్నాన్ని సాకారం చేయాలన్నారు. ఈ దీక్షల్లో ఐద్వా రాష్ట్ర ప్రదాన కార్యదర్శి మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి ఎల్గూరి జ్యోతితో పాటు పలువురు మహిళలు కూర్చోగా మున్సిపల్ కౌన్సిలర్లు గండూరి కృపాకర్, బత్తుల రమేష్, ఈద ప్రవీణ్, తాహేర్, బానోతు సైదులు, లింగానాయక్, పోతురాజు ఇందుశ్రీ అనిల్, విజయనాయక్, చిరివెళ్ళ శభరీ, దంతాల సందీప్, మాజీ మార్కెట్ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, భూపతి రాములు, సట్టు నాగయ్య, రమణాచారి ఉన్నారు.

## కాళికాదేవి, వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు

❖ నేటి అంగడి కుర్మపల్లిలో ఐదురోజుల పాటు నిర్వహణ



**దశ, హైదరాబాద్:** శ్రీ జగజ్జనని కాళికాదేవి, శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. నేటి నుంచి సెప్టెంబర్ 1 వరకు ఐదు రోజుల పాటు వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆగస్టు 28న ఉదయం 11 గంటలకు కలశ స్థాపన, గణపతి పూజ, నైవేద్య పూజ, గ్రామ దేవతల ఆహ్వానం నిర్వహించనున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ కార్యక్రమం చేపట్టనున్నారు. నేటి ఉదయం యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు సాయంత్రం 5 గంటలకు శ్రీ వీరభద్రస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆగస్టు 30న అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, వివిధ పూజా కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఉదయం 11 గంటలకు వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం 6 గంటలకు బోనాల కార్యక్రమం, రాత్రి 8 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆగస్టు 31న సాయంత్రం 4 గంటలకు దుర్గాదేవి పూజ నిర్వహించనున్నారు. రాత్రి 7 గంటలకు మాలా ఉత్సవంతో పాటు బాణసంచా ప్రదర్శన నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సెప్టెంబర్ 1న ఉదయం 8 గంటలకు శ్రీశ్రీశ్రీ ఈశ్వరమ్మత పర్వదిన పూజలు నిర్వహించి బ్రహ్మోత్సవాలను ముగించనున్నారు.



## విద్యార్థులను కలవకుండా హౌస్ అరెస్ట్ చేయడం దుర్మార్గం

**దశ, ఓయూ:** రామంతాపూర్ పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై మాట్లాడేందుకు వెళ్లాల్సిన తనను పోలీసులు ఇంటివద్దే హౌస్ అరెస్ట్ చేశారని బీజేపీ రాష్ట్ర చీఫ్ రాం చందర్ రావు ఆరోపించారు. జీఓ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థులపై లాఠీచార్జీలు, కేసులు పెట్టడం సరికాదన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్, స్టైఫండ్లు, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ పూర్తిగా భ్రష్టుపట్టిందని, విశ్వవిద్యాలయాలు, పాఠశాలల్లోనూ సమస్యలు ఉన్నాయని విమర్శించారు. విద్యార్థులను కలవకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యగా అభివర్ణిస్తూ ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు.

## డ్రైవర్లకు ప్రమాద బీమా పథకం తెచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమే




**దశ, సూర్యాపేట ప్రతినిధి :** డ్రైవర్ల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ప్రమాద బీమా పథకాన్ని అమలు చేశామని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ లు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మన్నెం సదాశివారెడ్డి ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2015లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ డ్రైవర్ల కోసం అమలు చేసిన ప్రమాద బీమా పథకంలో భాగంగా తుంగతుర్తి నియోజకవర్గం మద్దిరాల మండలం పోలుమల్ల గ్రామానికి చెందిన కొడవలికంటి యాకయ్య కుటుంబ సభ్యులకు 5లక్షల బీమా చెక్కును బీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు గౌడ్‌చర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం డ్రైవర్ల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని వారు విమర్శించారు. డ్రైవర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రమాద బీమా పథకాన్ని అమలు చేసిందన్నారు.

డ్రైవర్ల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడిందని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం డ్రైవర్ల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రజాక్, గ్రామ శాఖ అధ్యక్షుడు రేసు వెంకన్న, మధు, లింగారెడ్డి, వినోద్, మల్లారెడ్డి, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలి

❖ మునగాల సీఐ రామకృష్ణారెడ్డి



**దశ, మునగాల:** రోడ్డు ప్రమాదాల నివారణకు వ్యాపారులు, వాహనదారులు, ప్రజలు పోలీస్ శాఖ చేపడుతున్న రహదారి భద్రత చర్యలకు సహకరించాలని మునగాల సీఐ రామకృష్ణారెడ్డి కోరారు. గురువారం మునగాల పోలీస్ స్టేషన్‌లో వ్యాపారులు, స్థానిక ప్రజలతో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మునగాల మండల కేంద్రంలో జనాభా, వాహనాల రద్దీ రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. 65వ నంబర్ జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్లు, ఫ్లైఓవర్, అండర్‌పాస్, గణపవరం రహదారితో పాటు మండలంలోని ప్రధాన రహదారులపై వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించాలని సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు.



## పేదల సొంతింటి కల ఇందిరమ్మ ఇల్లు

❖ గృహ ప్రవేశంలో ముఖ్య అతిథిగా మద్దుల

**దశ, వెల్గటూర్:** పేదల సొంతింటి చిరకాల కల ఇందిరమ్మ ఇల్లు అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఎండపల్లి మాజీ సింగిల్ విండో చైర్మెన్ మద్దుల గోపాల్ రెడ్డి అన్నారు. గురువారం ఎండపల్లి మండలం లోని , గోడిశెల పేట గ్రామంలో గల తన అభిమాని కొమ్ము అశోక్ నూతన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశానికి హాజరయ్యారు. రిబ్బన్ కట్ చేసి , అశోక్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన ఉద్దేశం అని, ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు. రాష్ట్ర ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అనంతరం అశోక్ కుటుంబ సభ్యులు గోపాల్ రెడ్డిని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్టీఐ ఆవిర్భావ దినోత్సవానికి మంత్రి జూపల్లికి ఆహ్వానం



**దశ, హైదరాబాద్:** సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్టోబర్‌లో రవీంద్ర భారతిలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావును ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్ ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఆర్టీఐ చట్టం ద్వారా ప్రజలకు లభించిన హక్కులు, పారదర్శక పాలనలో సమాచార హక్కు చట్టం ప్రాధాన్యత, ప్రజల్లో ఆర్టీఐపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం తదితర అంశాలపై నిర్వహించనున్న కార్యక్రమ వివరాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

అలాగే సమాచార హక్కు చట్టాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ఆర్టీఐ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా మంత్రితో చర్చించినట్లు డాక్టర్ చంటి ముదిరాజ్ తెలిపారు. కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై మార్గదర్శనం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి, జాతీయ ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరవింద స్వామి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గుడ్డేటి ప్రవీణ్, రేపాక కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## విపత్తుల వేళ ప్రణాళికతో ముందుకు సాగాలి

❖ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**దశ, హైదరాబాద్:** వరదలు, అగ్ని ప్రమాదాలు, ఇతర విపత్తులు సంభవించినప్పుడు సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ యాక్షన్ ప్లాన్‌పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీచుపల్లి, అలంపూర్, నది అగ్రహారం తదితర నదీ పరివాహక ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే సహాయక చర్యలు చేపట్టేలా పక్కా ప్రణాళిక రూపొందించుకోవాలని అన్నారు. నదుల్లో ప్రమాదవశాత్తు ఎవరైనా మునిగిపోతే వెంటనే రక్షించేందుకు స్థానిక గజ ఈతగాళ్లు, మత్స్యకారులకు అవసరమైన బోట్లు, లైఫ్ జాకెట్లు, తాళ్లు, ఇతర రక్షణ పరికరాలను అందుబాటులో ఉంచాలని సూచించారు.

ఇందుకు అవసరమైన నిధులు, పరికరాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఎవరైనా వ్యక్తులు తప్పిపోయినప్పుడు వారి ఆచూకీ కోసం డ్రోన్ కెమెరాలను వినియోగించేందుకు అవసరమైన పరికరాలను కొనుగోలు చేయాలని సూచించారు. గద్వాల, అలంపూర్‌లోని అగ్నిమాపక కేంద్రాలకు ఫ్లోటింగ్ పోర్టబుల్ పంప్స్, రిమోట్ లైఫ్ బాయ్ తదితర ఆధునిక రెస్క్యూ పరికరాలను సమకూర్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు.జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, కలెక్టరేట్ లో అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన ఫైర్ సేఫ్టీ పరికరాలను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీపీఓ శ్రీకాంత్, అగ్నిమాపక కేంద్రం ఎస్సై రాకేష్, డి సెక్షన్ పర్యవేక్షకుడు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## హుజురాబాద్ మున్సిపల్ డంపింగ్ యార్డ్ పరిశీలించిన జిల్లా కలెక్టర్

**దశ, హుజురాబాద్:** హుజురాబాద్ మండలం సిర్సపల్లి సమీపంలో జాతీయ రహదారి 563ని ఆనుకొని ఉన్న డంపింగ్ యార్డ్ ను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా గురువారం రాత్రి పరిశీలించారు. జాతీయ రహదారిని ఆనుకొని డంపింగ్ యార్డ్ ఉండడం పట్ల భారత జాతీయ రహదారుల ప్రాధికారత సంస్థ అభ్యంతరం వ్యక్తం చేసిన నేపథ్యంలో ఈ స్థలాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా రెవిన్యూ, మునిసిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న స్థలంలో కొంత దూరం వరకు చెత్త డంప్ చేయడం నిలిపివేయాలని అన్నారు. ఇదే స్థలంలో రహదారికి కొంత దూరం తర్వాత డంప్ చేయాలని సూచించారు. రహదారిని అనుకున్న స్థలంలో పచ్చదనం పెంపొందించాలని, మొక్కలు నాటి సంరక్షించాలని అన్నారు. రెవిన్యూ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో చెత్త సేకరించే వాహనాలు జాతీయ రహదారి నుండి కాకుండా ప్రత్యామ్నాయ మార్గాల నుండి ఈ స్థలంలోకి వచ్చి డంప్ చేసేలా ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయాలని అన్నారు. జాతీయ రహదారి నుండి చెత్త సేకరణ వాహనాలు వెళ్లకుండా చూడాలని, హుజురాబాద్ పట్టణంలోని డివిజన్ల వారీగా సేకరించిన చెత్త డంప్ యార్డులో వేసేందుకు వివిధ ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయాలని ఆదేశించారు,కలెక్టర్ వెంట అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్టీవో జల కుమారి, ఎన్. హెచ్. ఏ. ఐ ప్రాజెక్టు డైరెక్టర్ భరద్వాజ్, తహసిల్దార్ నరేందర్ పాల్గొన్నారు.

